ఉల్లి గోదాములు నిరుపయోగం

- రైతులకు తప్పని అవస్థలు
- తప్పనిసరిస్థితుల్లో నష్టానికే అమ్ముకుంటున్న వైనం
- పట్టించుకోని అధికారులు, పాలకులు



గోదాముల రేకులు ధ్వంసమైపోతున్న దృశ్యం



కోడుమూరులో ముళ్లపొదలతో నిండిపోయిన ఉల్లిగోదాములు



ఉల్లిని మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేస్తున్న రైతులు

కోడుమూరు రూరల్: ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి నిర్మించిన ఉల్లి గోదాములు నిరుపయోగంగా మారాయి. కోడుమూరు, గూడూరు మండలాల్లో ఒక్కో గోదాం కోటి రూపాయల వ్యయంతో ఉల్లిపంట నిల్వచేసుకునే గోదాములు ఎనిమిదేళ్ల కిందట నిర్మించారు. అగ్రికల్చర్ మార్కెటింగ్ శాఖ రైతులు ఉల్లి నిల్వచేసుకునే గోదాంలు నిర్మించింది. ఉల్లి గోదాములు నిర్మించిన ప్రదేశాలు రైతులకు అనుకూలంగా లేకపోవడంతో రైతులు ఉల్లి పంటలను నిల్వ చేసుకోవడం లేదు. గతంలో కేవలం నాటి కాంట్రాక్టర్, తెలుగుదేశం పార్టీ నేతలు కమిషన్‌లు దండుకొని పనులు పూర్తి చేశారు గాని, రైతులకు ఆ గోదాములు ఉపయోగపడడం లేదు. మార్కెటింగ్ శాఖ అధికారులు నేటికి గోదాముల నిర్వహణను గాలికొదిలేయడంతో నిరుపయోగంగా మారాయి.

నిల్వ చేసుకునే గోదాములు లేక నష్టాల పాలవుతున్న రైతులు

కోడుమూరు మండలంలోని వర్కూరుకు చెందిన రైతు రామదాసు తనకున్న ఎకరాలో ఉల్లి సాగు చేశాడు. రైతు కష్టం ఫలించి 20రోజుల కిందట మంచి దిగుబడులు వచ్చాయి. అయితే మార్కెట్లో క్వింటాల్ ఉల్లి రూ.2700 మాత్రమే ఉంది. అయినా దిగుబడులను అమ్ముకున్నాడు. ప్రస్తుతం రూ.3500 నుంచి రూ.4వేల వరకు క్వింటాల్ ఉల్లి పలుకుతోంది. రైతు రామదాసు ఉల్లి దిగుబడులను నిల్వచేసుకుని ఉంటే ప్రస్తుతం లాభపడేవాడు. ఇది ఒక్క రామదాసు పరిస్థితి మాత్రమే కాదు... ఉల్లి సాగు చేసిన చాలామంది రైతుల పరిస్థితి. జిల్లాలోనే కోడుమూరు ప్రాంత రైతులు అధికంగా ఉల్లిసాగును చేస్తారు. ఉల్లి సాగు చేసిన రైతులంతా పంట వచ్చిందంటే చాలు ధర ఉన్నా లేకున్నా దిగుబడులను అమ్ముకోవాల్సిన దుస్థితి దాపురించింది. గోదాములు ఉంటే మార్కెట్లో ఉల్లికి ధర లేని సమయంలో దిగుబడులను నిల్వ చేసుకుని, ధర ఉన్నప్పుడు అమ్ముకుని రైతులు లాభ పడవచ్చు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారిన వైనం

ఉల్లి దిగుబడుల నిల్వల కోసం నిర్మించిన గోదాములు తాగుబోతులు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయాయి.. కోడుమూరు, గూడూరు పట్టణ శివారులో నిర్మించిన గోదాములు పిచ్చిమొక్కలతో నిండిపోయి ఎందుకూ పనికిరాని విధంగా తయారయ్యాయి. వీటి నిర్వహణను అధికారులు పూర్తిగా గాలికొదిలేయడంతో గోదాములకు వేసిన సిమెంట్ రేకులు పగిలిపోచి షెడ్లు ధ్వంసమైపోతున్నాయి. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గోదాములకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలని ఉల్లి రైతులు కోరుతున్నారు.

నష్టానికి అమ్ముకోవాల్సి వస్తోంది



ప్రతి యేటా ఉల్లి పంట సాగు చేస్తుంటా. ఉల్లి చేతికొచ్చే సమయానికి మార్కెట్లో ధర ఉండదు. ఉల్లి నిల్వ చేసుకునే గోదాములు లేకపోవడంతో మార్కెట్లో ఎంత రేటు ఉంటే అంతే రేటుకు అమ్ముకోవాల్సి వస్తోంది. దీంతో ఉల్లికి మంచి రేటు దక్కడం లేదు. అధికారులు స్పందించి నిర్మించిన గోదాములను అందుబాటులోకి తెస్తే బాగుంటుంది.

– రైతు మిన్నెల్ల హుసేన్, ప్యాలకుర్తి

గోదాములను అందుబాటులోకి తేవాలి



ఈ ప్రాంత రైతులు ఎక్కువగా ఉల్లి పంటను సాగు చేస్తారు. ఉల్లి దిగుబడులను నిల్వ చేసుకునే గోదాములు లేక రైతులు వచ్చిన ధరకు అమ్ముకుంటూ ప్రతి యేటా తీవ్రంగా నష్టపోతున్నారు. కోడుమూరు, గూడూరులలో నిరుపయోగంగా ఉన్న ఉల్లి గోదాములను ప్రభుత్వం తక్షణమే బాగు చేయించి రైతులకు అందుబాటులోకి తెస్తే బాగుంటుంది.

– కృష్ణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, కోడుమూరు

క్లుప్తంగా

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి



ఉపాధ్యాయుల హాజరును పరిశీలిస్తున్న ఆదామ్‌బాషా

సి.బెళగల్: ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించాలని ఎంఈఓ– 2 ఆదామ్‌బాషా సూచించారు. మండల పరిధిలోని పోలకల్ మేయిన్ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అదేవిధంగా విద్యార్థులను పాఠ్యాంశాలను చదివించి వారి సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థుల వర్క్ బుక్‌లను తనిఖీ చేసిన ఎంఈఓ బోధనపై హెచ్‌ఎం మునిస్వామితో చర్చించారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి



విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న హేమలత

కోడుమూరు రూరల్: ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని రాష్ట్రీయ బాలస్వస్థ కార్యక్రమ జిల్లా కో–ఆర్డినేటర్ హేమలత సూచించారు. గురువారం కోడుమూరులోని కస్తూర్బా పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రలు, నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని విద్యార్థినులకు ఆమె సూచించారు. అనంతరం మండలంలోని కల్లపరి గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌ను ఆమె తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శరభయ్య కోడుమూరు పీహెచ్‌సీ కో–లోకేటెడ్ ఎంపీహెచ్‌ఓ నరసప్ప,హెల్త్ సూపర్‌వైజర్స్ కమాల్‌సాహెబ్, ఉమాభాయి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

ఓర్వకల్లు: మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా అల్పాహారం తయారీపై కాల్వబుగ్గ గురుకుల పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. ప్రిన్సిపాల్ ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల వంట నిర్వాహకులకు చింతపండు పులిహోరా, సాంబార్ బాత్, టమాటా బాత్ అల్పాహారం తయారీపై అవగాహన కల్పించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని ఎంఈఓ ఓంకార్‌యాదవ్ సూచించారు.

రేపు చింతలముని స్వామి ఆరాధనోత్సవం

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు సమీపంలో జాతీయ రహదారి ప్రక్కన వెలసిన చింతలముని, నల్లారెడ్డి స్వాముల ఆరాధనోత్సవం ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్లు పూజారులు కృష్ణ, చంద్రకళ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వాముల వారికి సుప్రభాత సేవ, గ్రామ దేవతల పూజ, అభిషేకార్చనలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు స్వాములకు మహానైవేద్యం సమర్పించి, సాయంత్రం బిందె సేవ, ఆకుపూజలు నిర్వహిస్తామన్నారు. రాత్రి భజన ఉంటుందని పేర్కొన్నారు.

హైస్కూల్‌లో వాటర్ ప్లాంట్ ఏర్పాటు



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న వరలక్ష్మి

కోడుమూరు రూరల్: మండలంలోని అమడగుంట్ల హైస్కూల్లో విద్యార్థుల సౌకర్యార్థం సర్పంచ్ వరలక్ష్మి తన భర్త రఘునాథ్‌రెడ్డి జ్ఞాపకార్థం రూ.3లక్షలు వెచ్చించి వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయించారు. ఈ మేరకు ప్లాంట్‌ను గురువారం సర్పంచ్ చేతుల మీదుగా హెచ్‌ఎం అనంతయ్య ప్రారంభింపజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తక్షణమే నర్సెస్ ఎన్నికలు నిర్వహించాలి

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించాలని పలువురు హెడ్‌నర్సులు, స్టాఫ్‌నర్సులు డిమాండ్ చేశారు. గురువారం వారు కర్నూలు మెడికల్ కాలేజి ఆడిటోరియంలో సమావేశమయ్యారు. గత ఆరేళ్ల నుంచి ప్రభుత్వం ఎన్నికలు వాయిదా వేస్తూ వస్తోందన్నారు. ఈ కారణంగా ఆసుపత్రిలో ఏళ్ల తరబడి నర్సులకు సంబంధించిన సమస్యలు తిష్ట వేశాయని చెప్పారు. అసోసియేషన్ లేకపోవడంతో తమ సమస్యలు ఎవ్వరికి చెప్పుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం స్పందించి పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

ప్రతిఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలి



అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీపీఓ మంజులవాణి



చెత్త తరలింపుపై సూచనలిస్తున్న ఎంపీడీఓ

పాణ్యం: ప్రతిఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని, ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయకూడదని డీపీఓ మంజులవాణి సూచించారు. మండల కేంద్రం పాణ్యంలో గురువారం నిర్వహించిన స్వచ్ఛతహీ సేవా కార్యక్రమానికి డీపీఓ హాజరయ్యారు. స్వచ్ఛతపై అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయితీ సిబ్బందికి అందించాలని సూచించారు. గ్రామాల శుభ్రతే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగసుంకమ్మ, ఈఓఆర్డీ సులోచన, ఏఓ నరసింహారెడ్డి, సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక సచివాలయ ఉద్యోగులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛతపై విద్యార్థులతో ఈఓఆర్డీ సుబ్బరాయుడు ప్రతిజ్ఞ చేయించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని ఈ సందర్భంగా ఈఓఆర్డీ పిలుపునిచ్చారు.

సి.బెళగల్: స్వచ్ఛతాయే సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం మండల అధికారులు ప్రభుత్వ కార్యాలయాల్లో చెత్త తొలగింపు కార్యక్రమాలను చేపట్టారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ పాండురంగన్నతో కలిసి ఉద్యోగులు చెత్తను తొలగించి కాల్చివేశారు. అనంతరం వారు స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ జ్యోతి, కార్యాలయాల పర్యవేక్షకులు శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

కల్లూరు: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పారిశుద్ధ్య పనులను సక్రమంగా చేయించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కొంగనపాడు గ్రామంలో జరుగుతున్న పనులను గురువారం ఆయన పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం గ్రామంలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈఓఆర్డీ సుబ్బరాయుడు



సి.బెళగల్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చెత్తను తొలగిస్తున్న ఎంఈఓ జ్యోతి, ఉద్యోగులు

వంట నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి



వంట తయారీపై సూచనలు చేస్తున్న ఎంఈఓ

సి.బెళగల్: మధ్యాహ్న భోజనం తయారీ నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని ఎంఈఓ – 2 ఆదామ్‌బాషా సూచించారు. స్థానిక కస్తూర్బా విద్యాలయంలో మండలంలోని కంబదహాల్ బీసీ, పల్‌దొడ్డి,కొండాపురం, మారందొడ్డి, పలుకుదొడ్డి, క్రిష్ణదొడ్డి, ఈర్లదిన్నె, తిమ్మందొడ్డి, వై కొట్టాల తదితర పాఠశాలల మధ్యాహ్న భోజన వంట నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారు. భోజనం నాణ్యత, శుభ్రత, తదితర విషయాలను ఎంఈఓ వివరించారు. పరిశుభ్రతపై డెమోలో వీడియో రూపంలో శిక్షణ ఇచ్చారు.

ముళ్ల పొదల తొలగింపు

సి.బెళగల్: మండల పరిధిలోని కంబదహాల్లో ముళ్ల పొదలను గురువారం సర్పంచ్ కురువ చిన్న ఈరమ్మ జేసీబీతో తొలగింపు పనులను చేపట్టారు. గ్రామంలో ఎమ్మిగనూరు – గూడూరు రోడ్డుకు అడ్డంగా ఉన్న ముళ్ల పొదలు, దిబ్బలను, మట్టి కుప్పలను జేసీబీతో తొలగించారు. ఈ పనులను పంచాయతీ ఈఓఆర్డీ సందీప్, కార్యదర్శి అభిషేకం పరిశీలించారు.

జంట హత్యల కేసు కొట్టివేత

కర్నూలు : నగరంలోని గిప్సన్ కాలనీ తేజా డీలక్స్ అపార్టుమెంటులో గతంలో జరిగిన పి.మధుసూదన్‌రెడ్డి, పి.రమాదేవి జంట హత్యల కేసులో నేరం రుజువు కానందున కేసును కొట్టివేస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది గురువారం తీర్పు చెప్పారు. 2013 డిసెంబర్ 29న రాత్రి 10 గంటలకు నిందితులు ఇంటిపై దాడి చేసి డబ్బు, బంగారం దోచుకోవడానికి జంట హత్యలకు పాల్పడ్డారు. డబ్బు దొరకకపోవడంతో ఒంటిపై ఉన్న బంగారాన్ని ఎత్తుకెళ్లారు. హతుడి తమ్ముడు పి.ధనుంజయరెడ్డి ఫిర్యాదు మేరకు కర్నూలు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు జరిపి నిందితులు మహానంది మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన వడ్డె కుంబాపు వెంకటప్రసాద్, మటం రోహిత్ కుమార్, నవీన్ కుమార్, వెల్దుర్తికి చెందిన జి.సీరన్నలు కారణమని పోలీసులు చార్జ్ షీటు దాఖలు చేశారు. కేసు విచారణలోపే రెండో, మూడో నిందితులు మటం రోహిత్‌కుమార్, ఎం.రాజశేఖర్‌లు మరణించారు. మిగతా ముగ్గురిపై కేసు విచారణ జరిగింది. వీరిపై సాక్షాధారాలు రుజువు కానందున కేసు కొట్టివేశారు. నిందితుల తరపున న్యాయవాది బి.మురళీ మనోహర్ వాదించారు.

మానవ హక్కుల కమిషన్‌కు కల్లుకుంట సంఘటన

కర్నూలు(అర్బన్): జిల్లాలోని కల్లుకుంట గ్రామంలో జరిగిన అవమానవీయ సంఘటనను కేంద్ర మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకుపోవడం జరిగిందని బీఎస్‌ఎస్ చీఫ్, హైకోర్టు న్యాయవాది కాకర్ల చంద్రశేఖర్ తెలిపారు. గ్రామానికి చెందిన దళిత గోవిందమ్మ అనే మహిళపై విచక్షణా రహితంగా జరిగిన దాడికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన నివేదికను న్యూఢిల్లీలో కమిషన్ చైర్ పర్సన్ విజయభారతి సాయిని అందించామని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనపై ఎన్‌ఎస్‌ఆర్‌సీ దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ, పూర్తి వివరాలతో కూడిన అఫిడవిట్స్ అందించాలని ఏపీ పోలీసు, సంబంధిత ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిగే వరకు మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడిన వారిని ఉపేక్షించబోమన్నారు. కమిషన్‌ను కలిసిన వారిలో బీఎస్‌ఎస్ కో–కన్వీనర్ సునీల్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడు రామతీర్థం అమరేష్ ఉన్నారన్నారు.

కేసీలో మృతదేహం లభ్యం

కర్నూలు : స్థానిక పాతబస్తీలోని చిత్తారి వీధికి చెందిన కురువ మద్దిలేటి కేసీ కెనాల్‌లో శవమై కనిపించాడు. కనిపించకుండాపోయిన కుమారుడు దీపక్ ఏడాది అయినా తిరిగి రాలేదనే బెంగతో మద్దిలేటి మంగళవా రం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు అతని కోసం గురువారం కేసీ కెనాల్ వెంట గాలిస్తుండగా జూపాడుబంగ్లా సమీపంలో నీటిలో తేలియాడు తూ కనిపించాడు. మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులు ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి భద్రపరిచారు. మద్దిలేటి మృతికి దారి తీసిన కారణాలపై విచారణ జరుపుతున్నట్లు సీఐ రామయ్య నాయుడు తెలిపారు.

ఉత్సవాలలో భక్తిని చాటుకోవాలి



సీఐ తబ్రేజ్, ఎస్‌ఐ శ్రీనివాసులును సత్కరిస్తున్న వినాయక మండలి కమిటీ సభ్యులు

కోడుమూరు రూరల్: ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకుంటూ భక్తిభావం, ఐక్యతను చాటుకోవాలని కోడుమూరు సీఐ తబ్రేజ్ సూచించారు. వినాయక చవితి ఉత్సవాలను సంప్రదాయ బద్ధంగా నిర్వహించిన కమిటీ సభ్యులకు గురువారం సీఐ తబ్రేజ్, ఎస్‌ఐ శ్రీనివాసులు 'చాంపియన్స్ ఆఫ్ కల్చరల్' పేరిట నగదు బహుమతులను అందజేశారు. విద్యా చేనేత, కుర్నీ, వ్యవసాయ వినాయక మండలి కమిటీ సభ్యులకు కర్నూలు క్వాలిటీ టైల్స్ యాజమాన్యం సహకారంతో రూ.4వేల చొప్పున నగదు, మెమోంటోలను సీఐ అందజేశారు. ఈ సందర్భంగా వినాయక కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, పరమేశ్వరరెడ్డి, కృష్ణ, రాజు, మాధవస్వామి సీఐ, ఎస్‌ఐని సత్కరించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ప్రజలు ఐక్యమత్యంగా జీవించాలన్న సంకల్పంతో మన పెద్దలు వినాయక చవితి ఉత్సవాలకు నాంది పలికారన్నారు. కులమతాలకు అతీతంగా ఉత్సవాల సంప్రదాయాలను ప్రతిఒక్కరూ గౌరవించాలని, ఐకమత్యంగా మెలగాలని పిలుపునిచ్చారు.

డాక్టర్ వెంకటరమణకు సన్మానం

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏఆర్‌ఎంవోగా పనిచేస్తున్న డాక్టర్ సీహెచ్ వెంకటరమణను గురువారం ఉద్యోగులు సన్మానించారు. ఆయన ఇటీవల అసిస్టెంట్ సివిల్ సర్జన్ నుంచి డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొంది కర్నూలు మెడికల్ కాలేజీలోని ఎస్‌పీఎం విభాగంలో పోస్టింగ్ పొందారు. ఈ మేరకు ఆయనను ఆఫీస్ అకౌంటెంట్ కుమారస్వామి, సీనియర్ అసిస్టెంట్‌లు శ్రీనివాసులు, జమాల్ తదితరులు పాల్గొన్నారు.

మసీదు కమిటీల్లో టీడీపీ జోక్యం తగదు

- ఆల్ ఇండియా ముస్లిం మైనారిటీస్ కౌన్సిల్ చైర్మన్ సయ్యద్ మహమ్మద్ పీర్

కర్నూలు(అర్బన్): పవిత్ర మసీదు కమిటీల్లో తెలుగుదేశం నాయకుల రాజకీయ జోక్యం తగదని ఆల్ ఇండియా ముస్లిం మైనారిటీస్ కౌన్సిల్ చైర్మన్ సయ్యద్ మహమ్మద్ పీర్ అన్నారు. మసీదు కమిటీలు, ఇమామ్‌లను తొలగింపు విషయంలో టీడీపీ నేతల ప్రమేయం లేకుండా మార్గదర్శకాలు ఇవ్వాలని ఆయన గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం కొందరు టీడీపీకి మద్దతు ఇస్తున్న ముస్లింలు తమ పంతం నెగ్గించుకునేందుకు మసీదు కమిటీల్లో జోక్యం చేసుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యేలను అడ్డం పెట్టుకొని మసీదులు, దర్గాలు, మదరసాలపై పెత్తనం చెలాయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటివి వక్ఫ్ చట్టానికి విరుద్ధమన్నారు. మసీదులు అల్లాహ్‌కు చెందిన మందిరాలని, ఇలాంటి ఆధ్యాత్మిక ప్రదేశాల్లో రాజకీయాలను దూరంగా ఉంచాలని ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో మత ప్రదేశాల రక్షణ, ముస్లింల సంక్షేమం అత్యంత అవసరమన్నారు.

వైద్య పరీక్షల నివేదికలు త్వరగా ఇవ్వాలి



పనులను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఎంతో సుదూర ప్రాంతాల నుంచి ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చిన రోగులకు వైద్యపరీక్షల నివేదికలను త్వరగా ఇచ్చి సహకరించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. గురువారం ఆయన ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు. న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో బయోకెమిస్ట్రీ విభాగంలో ఉన్న వైద్యపరికరాలను పరిశీలించి వాటి పనితీరు గురించి ఆరా తీశారు. ప్రభుత్వం నుంచి సరఫరా అయ్యే రీ ఏజెంట్స్ ఏవి ఉన్నాయి, లోకల్ పర్చేజ్‌లో వాటికి సంబంధించిన స్టాక్ వివరాలు పరిశీలించి అవసరమైన వాటికి ఇండెంట్ పెట్టుకోవాలని సిబ్బందికి సూచించారు. డ్రైనేజీ పనుల గురించి ఆరా తీసి మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ఆసుపత్రి ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని పారిశుద్ధ్య సిబ్బందికి ఆదేశించారు. ఆయన వెంట సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, ఏఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, ఏడీ రమేష్‌బాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి ఉన్నారు.

మెడికల్ షాపుల నుంచి బలవంతపు విరాళాలు

- ఒక్కో దుకాణం నుంచి రూ.5వేలు వసూలు

కర్నూలు(హాస్పిటల్): విజయవాడలో ఇటీవల జరిగిన వరదల్లో నష్టపోయిన వారికి సాయం చేయాలంటూ డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ నాయకుల పేరిట విరాళాలు వసూలు చేస్తున్నారు. వారం క్రితమే జిల్లాలోని అన్ని దుకాణాల నుంచి అవసరమైన మందుల కిట్‌లను తెప్పించి విజయవాడకు పంపించారు. తాజాగా ఒక్కో మెడికల్ షాపు నుంచి రూ.5 వేలు ఇవ్వాలని బలవంతంగా వసూలు చేస్తున్నారు. పట్టణాల్లో అయితే రూ.5 వేలు, మండల కేంద్రాల్లో ఉన్న షాపులైతే రూ.2 వేల చొప్పున అసోసియేషన్ నాయకులు వసూలు చేస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అసోసియేషన్ ద్వారా వసూలు చేస్తున్నామని స్థానిక నాయకులు చెబుతుండటం గమనార్హం. కర్నూలు జిల్లాలోనే 1200లకు పైగా రిటైల్ దుకాణాలు ఉన్నాయి. అన్ని దుకాణాల నుంచి అంతో ఇంతో వసూలు చేసి తప్పక పంపించాలని రాష్ట్ర ఉన్నతాధికారి ఆదేశించడంతో ఇక్కడి నాయకులు వసూళ్లకు దిగినట్లు సమాచారం.

వరద బాధితులకు విరాళం



సీపీఐ జిల్లా నేతలకు నగదు అందజేస్తున్న నాయకులు

కోడుమూరు రూరల్: విజయవాడ వరద బాధితుల కోసం కోడుమూరులో సీపీఐ నాయకులు ప్రజల నుంచి సేకరించిన రూ.20వేలను గురువారం సీపీఐ జిల్లా నాయకులకు అందజేశారు.ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య మాట్లాడుతూ వరదల్లో నష్టపోయిన బాధితుల కోసం ప్రజలు తమ వంతు సాయం అందజేస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు రాష్ట్ర సంఘం కార్యదర్శి జగన్నాథం, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, కార్యవర్గ సభ్యులు కృష్ణ, మండల కార్యదర్శి రాజు, స్థానిక నాయకులు రాముడు, శేషుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలడిగితే...మాకు సంబంధం లేదంటున్నారు

- ఆసుపత్రి అధికారులపై సెక్యూరిటీ గార్డుల ఆవేదన



ఆసుపత్రిలో ధర్నా చేస్తున్న సెక్యూరిటీ గార్డులు

కర్నూలు(హాస్పిటల్): 'మాకు నాలుగు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదు. జీతాలు ఇప్పించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను అడిగితే మీరు మాకు సంబంధం లేదని, నా వద్దకు రాకూడదని చెబుతున్నారు' అని సెక్యూరిటీ గార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం వారు ఆసుపత్రిలోని న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్ సమీపంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము విధుల్లో చేరినప్పటి నుంచి ఏ నెల కూడా సక్రమంగా జీతాలు ఇవ్వలేదన్నారు. ఎక్స్‌పర్ట్ ఏజెన్సీ వారిని అడిగితే స్పందన లేదని, ఇక్కడి ఎస్‌వో పట్టించుకోవడం లేదని, ఆసుపత్రి అధికారులను అడిగితే నా వద్దకు రావొద్దని చెబుతున్నారని, ఇక తాము ఎవ్వరిని వేడుకోవాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిసారి నాలుగైదు నెలలకు ఒకసారి జీతాలు ఇస్తున్నారని, అది కూడా ఒకటి, రెండు నెలలు కలిపి మాత్రమే ఇస్తూ మిగిలినవి పెండింగ్‌లో ఉంచుతున్నారని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి తమకు జీతాలు ఇప్పించాలని వారు కోరారు.

ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలి



పులకుర్తి సచివాలయంలో సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు రూరల్ : ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదేశించారు. మండల పరిధిలోని కల్లపరి, పులకుర్తి గ్రామసచివాలయాలను గురువారం ఈఓఆర్డీ మంజులతో కలిసి ఎంపీడీఓ తనిఖీ చేశారు. రికార్డులను, సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిష్టర్లను ఎంపీడీఓ పరిశీలించారు. సమయపాలన పాటించడం లేదనే ఫిర్యాదులు ఉన్నాయని, పద్ధతులు మార్చుకోకుంటే చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎంపీడీఓ హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ బయోమెట్రిక్ హాజరు వేయాలని, సిబ్బంది బయటకు వెళ్లే సందర్భాల్లో మూమెంట్ రిజిష్టర్‌లో పొందుపర్చాలని ఎంపీడీఓ సూచించారు.భాగంగా గ్రామాల్లో ప్రతి రోజు కార్యక్రమాలను నిర్వహించి పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఆటల పోటీలు ప్రారంభించిన ఎంఈఓ



పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ ఓంకార్‌యాదవ్

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లు జెడ్పీ హైస్కూల్ మైదానంలో విద్యార్థులకు ఆటల పోటీలు అట్టహాసంగా నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే పోటీలను గురువారం ఎంఈఓ ఓంకార్ యాదవ్ ప్రారంభించారు. అండర్–14, అండర్–17 విభాగంలోని బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. లొద్దిపల్లె హైస్కూల్ మినహా, మిగతా అన్ని పాఠశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక హెచ్‌ఎం రామచంద్రారెడ్డి, బాలభారతి పాఠశాల ప్రిన్సిపాల్ క్లమెట్ సత్యబాబు, ఆయా గ్రామాల ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు పాల్గొన్నారు.